ఈనాడు

ఆదివారం డిసెంబరు 23, 2018

# భారత సునామీ హెచ్చరిక వ్యవస్థ అత్యుత్తమం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారత్‌లోని సునామీ హెచ్చరికల వ్యవస్థ ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవాకేంద్రం (ఇన్‌కాయిస్)లో అంతర్జాతీయ మహాసముద్ర కార్యాచరణ విజ్ఞాన శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్ తరాలకు అత్యుత్తమ శిక్షణను అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు వెయ్యి మందికి ఈ కేంద్రంలో సునామీ హెచ్చరికలపై శిక్షణనిచ్చిందని, అందులో 200 మంది 38 దేశాలకు చెందినవారున్నారని వెల్లడించారు. షిమాగో నివేదిక ప్రకారం ప్రపంచంలో సీఎస్ఐఆర్‌లాంటి ప్రతిష్ఠాత్మక పరిశోధక కేంద్రాలు 1,207 ఉంటే, అందులో భారతదేశం 9వ స్థానంలో నిలిచిందన్నారు. ఇన్‌కాయిస్ అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానంతో దారితప్పిన నౌకలు, వ్యక్తుల సమాచారాన్ని కనుక్కోవడం సులభమైందన్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ప్యారిస్ ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో భాగంగానే ప్రధాని నరేంద్రమోదీ అంతర్జాతీయ సోలార్ కూటమిని ఏర్పాటు చేశారని, చాలా దేశాలు ఇందులో ప్రవేశించాయని పేర్కొన్నారు. 2020 నాటికి వాహన ప్రమాణాలను బీఎస్-4 నుంచి బీఎస్-6కు పెంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ షినోయ్, ఇన్‌కాయిస్ పరిశోధకులు పాల్గొన్నారు.



ప్రగతినగర్‌లోని ఇంకాయిస్‌లోని నూతన అతిథి గృహాన్ని శనివారం ప్రారంభించిన కేంద్ర మంత్రి డా.హర్ష వర్ధన్ తదితరులు